నమస్తే తెలంగాణ

# కామారెడ్డి

5 | నిజామాబాద్, బుధవారం 14 మే 2025 | KAMAREDDY

## అప్పుడు ఫస్ట్.. ఇప్పుడు లాస్ట్..

ఒకప్పుడు స్టేట్ ర్యాంకర్లతో రాష్ట్ర స్థాయిలో పేరుగాంచిన ఉమ్మడి జిల్లా ఈసారి అట్టడుగు స్థానాలతో అపకీర్తిని మూట గట్టుకున్నది. ఏప్రిల్ 22న విడుదలైన ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో రెండు జిల్లాలు చిట్టచివరన నిలిచాయి. ఇంటర్ ఫలితాల్లో కామారెడ్డి జిల్లా ఆఖరి స్థానంతో, నిజామాబాద్ జిల్లా 25వ స్థానంతో నవ్వుల పాలయ్యాయి. ఏప్రిల్ 30న విడుదలైన పదో తరగతి ఫలితాలు ఉభయ జిల్లా అధికారుల పేలవమైన పనితీరుకు అద్దం పట్టాయి.

## పంచాయితీలు, రాజకీయాలు?

వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో విద్యార్థుల సన్నద్ధతపై ఉన్నతాధికారులు దృష్టి సారించలేదు. ఉపాధ్యాయ సంఘాలతో టైమ్ పాస్ మీటింగ్‌లతోనే సరిపెట్టారు. విద్యార్థుల భవిష్యత్తును పక్కన పెట్టి చిల్లర పంచాయితీలతో కాలక్షేపం చేశారు. మరోవైపు, సన్నద్ధతలో కీలకమైన ఉపాధ్యాయులు సైతం దుమ్మా కొట్టారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ నాయకులతో పోటీ పడి ప్రచారాల్లో మునిగి తేలారు. సంఘాల పేరుతో జల్సాలు చేశారు. ఉమ్మడి జిల్లాల్లో డీఈవోల పర్యవేక్షణ వైఫల్యం మూలంగా ఫలితాలు దారుణంగా వచ్చాయి. ఉన్నతాధికారులు సైతం సమీక్షలు చేయకపోవడంతో పట్టించుకునే వారే లేకుండా పోయారు.







**పదో తరగతి** ఫలితాల్లో ఒకప్పుడు నిజామాబాద్ మొదటి స్థానంలో నిలిచేది. రాష్ట్రంలోనే ఇందూరు ఏకఛత్రాధిపత్యం కొనసాగుతుండేది. రాష్ట్ర స్థాయి ర్యాంకులు కూడా మన విద్యార్థులకే దక్కేవి. ఇంటర్‌లోనూ ఇందూరుకు తిరుగుండక పోయేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా రివర్స్ అయింది. ఉమ్మడి జిల్లా మొదటి నుంచి అధమ అట్టడుగు స్థానానికి పడిపోయింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల విద్యాశాఖ పనితీరు ఏపాటిదో టెన్త్, ఇంటర్ ఫలితాలతో తేలిపోయింది. ఇంటర్‌లో కామారెడ్డి జిల్లా చివరి స్థానంలో నిలిచి పరువు పోగొట్టుకోగా, నిజామాబాద్ 25వ స్థానంతో నవ్వుల పాలైంది. పదో తరగతి ఫలితాల్లోనూ ఉమ్మడి జిల్లాల పేలవ ప్రదర్శన పునరావృతమైంది.


నిజామాబాద్, మే 13
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

SSC INTER

# అట్టడుగు చదువులు

- టెన్త్, ఇంటర్‌లో పేలవ ఫలితాలు
- పదో తరగతి విద్యాభ్యాసంలో అనేక వైఫల్యాలు
- బహిర్గతమవుతున్న విద్యాశాఖ అధికారుల తీరు
- ఇంటర్ ఫలితాల్లోనూ అదే దుస్థితి
- ప్రైవేటు విద్యా సంస్థల్లోనూ అంతంత మాత్రమే
- నాణ్యమైన బోధన లేకపోవడమే ప్రధాన కారణం
- దారుణ ఫలితాలపై కలెక్టర్లు సమీక్షలు జరిపేనా..?

**ఉమ్మడి నిజామాబాద్** జిల్లాలో చదువుల నాణ్యత తీసికట్టుగా మారింది. అందుకే ఫలితాల్లో అట్టడుగు స్థానంలో ఉండాల్సిన దుస్థితి తలెత్తింది. ఉన్నతాధికారుల పట్టింపులేని తనం, విద్యాశాఖ, ఇంటర్ విద్యా శాఖల అధికారుల నిర్లక్ష్యం పేద, మధ్య తరగతి కుటుంబాలకు శాపంగా మారింది. నాణ్యమైన విద్యకు పునాది వేసి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ప్రభుత్వాధికారులు కనీసం పట్టించుకోక పోవడంతో ఈసారి పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో నెలకొన్న దుస్థితిని కండ్లకు కట్టింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు దారుణమైన ఉత్తీర్ణత శాతాలను సాధించాయి. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కీలకమైన టెన్త్, ఇంటర్ విద్యలో ఉభయ జిల్లాలు చతికిల పడ్డాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి సాధించిన దారుణమైన ఫలితాలు రాష్ట్ర స్థాయిలో రెండు జిల్లాల పరువును మంటగలిపాయి.



### విద్యాశాఖదే పాపం..

పదో తరగతి ఫలితాలు ఉమ్మడి జిల్లా విద్యాశాఖ పనితీరును తేటతెల్లం చేస్తున్నాయి. రాష్ట్ర స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలువకపోయినా, కనీసం గౌరవ ప్రదమైన స్థానాన్ని కూడా తెచ్చుకోలేక పోయాయి. ఇంతటి దారుణమైన ఫలితాలకు ఉపాధ్యాయుల పనితీరు, విద్యాశాఖ అధికారుల నిర్లిప్తత ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఉత్తీర్ణత శాతంతో పోలిస్తే మిగిలిన జిల్లాల కంటే ఉభయ జిల్లాలు అధమ స్థాయికి పడిపోయాయి. నిజామాబాద్ కంటే కామారెడ్డి జిల్లా స్థానం మరీ అట్టడుగుకు పడిపోయింది. జుక్కల్‌లో గణితశాస్త్రం పేపర్ లీకేజీ ఘటన తర్వాత జరిగిన పరీక్షల్లో ఎక్కువ మంది ఫెయిల్ అయినట్లు తెలిసింది. పేపర్ లీకేజీ వదంతులతో పరీక్షల నిర్వహణలో విద్యాశాఖ, పోలీసులు ఉక్కుపాదం మోపడంతో చీటీలపై ఆధారపడిన ఉపాధ్యాయుల తెలివి తేటలకు దెబ్బ పడినట్లు తెలిసింది. పాఠాలు బోధించకుండా టైమ్ పాస్ చేస్తూ వార్షిక పరీక్షల్లో వక్రబుద్ధిపైనే ఆధారపడిన చాలా మంది టీచర్లకు ఈ ఫలితాలు మింగుడు పడటంపడటం లేదు.

### టెన్త్‌లో పేలవ ఫలితాలు

టెన్త్ ఫలితాల్లో నిజామాబాద్ జిల్లా కూడా పేలవ ప్రదర్శన చేసింది. 96.62శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో 16వ స్థానానికే పరిమితమైంది. జిల్లాలో 22,694 మంది పరీక్షలకు హాజరు కాగా 21,928 మంది ఉత్తీర్ణత సాధించారు. గతేడాది పదో స్థానంలో నిలిచిన కామారెడ్డి జిల్లా ఏకంగా 20వ స్థానానికి పడి పోయింది. ఇక్కడ 12,542 మంది పరీక్షలు రాయగా, 11,871 మంది పాసయ్యారు. విద్యాశాఖ వైఫల్యాలపై సమీక్ష చేసుకోవాల్సి ఉండగా కొన్ని ఉపాధ్యాయ సంఘాలైతే అందుకు భిన్నంగా ప్రవర్తించడం సిగ్గుచేటుగా మారింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు పదో తరగతి ఫలితాల్లో దక్కిన స్థానాలపై జిల్లా కలెక్టర్లు ఇరువురు అసంతృప్తితో రగిలిపోతుండగా, ఉన్నతాధికారులను మచ్చిక చేసుకునేందుకు పూలబొకేలతో శుభాకాంక్షలు తెలియజేయడం విచిత్రంగా మారింది.

### ఇంటర్ కూడా అంతే..

గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంటర్ ఫలితాల్లో నిజామాబాద్, కామారెడ్డి చిట్టచివరన నిలిచాయి. నిజామాబాద్ జిల్లాలో 15,056 మంది ఫస్టియర్ విద్యార్థులు పరీక్ష రాయగా, 8,035 మంది (53.37శాతం) ఉత్తీర్ణులయ్యారు. 13,945మంది సెకండియర్ పరీక్షలకు హాజరవ్వగా 8,117 మంది (58.21శాతం) మాత్రమే పాసయ్యారు. ఇందూరు రాష్ట్ర స్థాయిలో 25వ స్థానంలో నిలిచింది. నాసిరకమైన బోధనకు ఈ ఫలితాలు నిదర్శనంగా మారాయి. 2021-22 విద్యా సంవత్సరంలో సెకండియర్‌లో 65శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, నాలుగేళ్లలో ఘోరంగా పడిపోయింది. ఇక కామారెడ్డి జిల్లా అయితే చిట్టచివరి స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అధికారుల అలసత్వం, బోధనా వైఫల్యం మూలంగా కామారెడ్డి జిల్లా పరువు మంటగలిసింది. 8,740 మంది ఫస్టియర్ పరీక్షలు రాయగా, 4,378 మంది (50.09 శాతం) పాసయ్యారు. 7,722 మంది సెకండియర్ విద్యార్థులు పరీక్ష రాయగా, 4,354 మంది (56.39శాతం) ఉత్తీర్ణులయ్యారు. కాలేజీల్లో బోధనా లోపాలను ఈ ఫలితాలు ప్రస్ఫుటం చేస్తున్నాయి. ప్రైవేటు కళాశాలల్లోనూ ఫలితాలు అంతంతే వచ్చాయి. మొత్తంగా అధికారులు, అధ్యాపకులు, ఉపాధ్యాయుల నిర్లిప్తత మూలంగా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో ఫలితాలు తారుమారయ్యాయి.

## సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

### కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, మే 13 : ఇంటర్, పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశపు హాలులో ఇంటర్, పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై ఆయా శాఖాధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 22 నుంచి 29 వరకు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలో 30 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారని, మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారని వివరించారు. మొదటి సంవత్సరంలో 5,088, ద్వితీయ సంవత్సరంలో 3,973 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 3 నుంచి 6వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మూడు పరీక్షా కేంద్రాల్లో 695 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఇంటర్మీడియెట్ అధికారి సలాం,డీఈవో రాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి చంద్రశేఖర్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్ కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్ కరుణశ్రీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆహ్వానం



బీఆర్ఎస్ పార్టీ కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి కుమారుడి వివాహం ఈ నెల 18న హైదరాబాద్‌లో జరగనున్నది. ఈ సందర్భంగా ఆయన మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవితను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు.

–కామారెడ్డి, మే 13

## కేసీఆర్ సార్ పాలనే బాగుండే..

### బాజిరెడ్డితో మల్కాపూర్ తండావాసులు



మల్కాపూర్ తండా తొలి సర్పంచ్ ఫకీరానాయక్ సతీమణి మాలిబాయితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి

సారంగాపూర్, మే 13: 'కాంగ్రెస్ సర్కారు అచ్చినంక ఏది కూడా సక్కగా ఇచ్చింది లేదు..కేసీఆర్ సార్ పాలననే బాగుండే..' అంటూ రూరల్ మండలంలోని మల్కాపూర్ తండా మహిళలు రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఎదుట గుర్తుచేసుకున్నారు. మల్కాపూర్‌లో తండాలో మంగళవారం నిర్వహించిన ఓ కార్యక్రమానికి బాజిరెడ్డి గోవర్ధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి తండావాసులు, పలువురు మహిళలతో ముచ్చటించారు. పదేండ్ల కేసీఆర్ పాలన ఎలా ఉం డే..ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలన ఎలా నడుస్తున్నదని వారిని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఇచ్చిన గ్యారెంటీలు, హామీలు అమలు చేస్తున్నారా అని అడుగగా..ఇచ్చిన హామీని ఒక్కటి కూడా అమలుచేసిందిలేదంటూ కొందరు మహిళలు అసహనం వ్యక్తంచేశారు. కేసీఆర్ సార్ పాలననే బాగుండెనని గుర్తుచేసుకొన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని బాజిరెడ్డి పేర్కొన్నారు. మళ్లీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే అని ధీమా వ్యక్తంచేశారు.బాజిరెడ్డి వెంట బీఆర్ఎస్ యువ నాయకుడు బాజిరెడ్డి జగన్, పార్టీ మండల అధ్యక్షుడు మీసాల మధుకర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, నాయకులు ప్రేమ్‌దాస్, గోపాల్ ఉన్నారు.

## సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

ఖలీల్‌వాడి, మే 13: కాళేశ్వరంలో ఈనెల 15 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న సరస్వతీ నది పుష్కరాలకు ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు సంస్థ నిజామాబాద్ రీజినల్ మేనేజర్ జ్యోత్స్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం ఆర్మూర్ 7382843133, బోధన్ 98495 00725, నిజామాబాద్ 9959226022, బాన్సువాడ 94911 05706, కామారెడ్డి 7382843747 నంబర్లను సంప్రదించాలన్నారు. భక్తులు ఆర్టీసీ కల్పిస్తున్న సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని, పవిత్ర పుణ్య స్నానాలు ఆచరించాలని సూచించారు.

## ధాన్యం సేకరణలో జాప్యానికి తావులేకుండా చర్యలు

- నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- ఉప్లూర్, తిమ్మాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

మోర్తాడ్/ ఆర్మూర్ టౌన్, మే 13: కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణలో జాప్యానికి తావులేకుండా ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టాలని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు.. అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన ఆర్మూర్, మోర్తాడ్ మండలం తిమ్మాపూర్, కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామాల్లో పర్యటించారు. ఆర్మూర్‌లోని ధోబీఘాట్ వద్ద ధాన్యం నిల్వలతోపాటు తిమ్మాపూర్, ఉప్లూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు సంబంధిత అధికారులు కేంద్రాల వద్ద క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. ధాన్యం సేకరణను నిశితంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. రైతుల నుంచి ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం నిల్వలు, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా! ధాన్యం అమ్మకాల వివరాలతో కూడిన రసీదులు అందిస్తున్నారా? అని ఆరా తీశారు. కొనుగోళ్లలో నిర్లక్ష్యానికి తావిచ్చే సొసైటీలకు వచ్చే సీజన్‌లో కేంద్రాలను కేటాయించవద్దని పౌరసరఫరాల శాఖ అధికారులకు సూచించారు.

**రైతులు ఇబ్బందులు పడొద్దు**

ఎట్టి పరిస్థితుల్లో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు పడకూడదని, ధాన్యం తెచ్చిన వెంటనే నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి తూకం చేయించాలని నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే నిర్దేశిత మిల్లులకు తరలించాలని, లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మిల్లుల వద్ద సకాలంలో అన్‌లోడింగ్ చేసుకునేలా పర్యవేక్షించాలన్నారు. సూపర్‌అమన్ రకం ధాన్యాన్ని దిగుమతి చేసుకునేందుకు కొంతమంది మిల్లర్లు విముఖత చూపుతున్నారని కేంద్రాల నిర్వాహకులు తెలుపగా.. మిల్లర్లతో సమావేశమై ఇబ్బందులు లేకుం డా చూస్తామని కలెక్టర్ అన్నారు. ఆలస్యంగా పంట దిగుబడి అందిన అన్ని ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఉంచామని రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. ఆర్డీవో రాజాగౌడ్, డీఎస్‌వో అరవింద్‌రెడ్డి, సివిల్‌సప్లయ్ డీఎం శ్రీకాంత్‌రెడ్డి, డీసీవో శ్రీనివాస్, డీపీఎం సాయిలు, సొసైటీ చైర్మన్లు కల్లెంఅశోక్, రేగుంట దేవేందర్, తహసీల్దార్లు ఆంజనేయులు, కృష్ణ తదితరులు ఉన్నారు.



తిమ్మాపూర్‌లో కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

## ప్రశాంతంగా పాలిసెట్

కామారెడ్డి/ఖలీల్‌వాడి, మే 13 : పాలిటెక్నిక్ (డిప్లొమా) కోర్సుల్లో ప్రవేశానికి మంగళవారం నిర్వహించిన పాలిసెట్ ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. కామారెడ్డి జిల్లాలో ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా..2,900 (బాలురు 1389, బాలికలు 1511) మంది అభ్యర్థులకు 2,766 (బాలురు 1324,బాలికలు 1442) మంది పరీక్షకు హాజరైనట్లు జిల్లా కో-ఆర్డినేటర్ విజయకుమార్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 16 కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 6,542 మంది విద్యార్థులకు 6,111 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 93.4 (బాలురు 93.9, బాలికలు 92.9) శాతం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ పరీక్షా కేంద్రంలో విద్యార్థిని తనిఖీ చేస్తున్న సిబ్బంది

కామారెడ్డిలోని ఓ పరీక్షా కేంద్రంలో హాల్‌టికెట్‌ను పరిశీలిస్తున్న పోలీసు





పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు



హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు